క్లుప్తంగా

ఎరువుల దుకాణాలు తనిఖీ


ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శివనాయక్

సైదాపురం : రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించాలని, నకిలీలు అంటకడితే కఠిన చర్యలు తప్పవని పొదలకూరు ఏడీఏ శివనాయక్ హెచ్చరించారు. ఆయన సోమవారం సైదాపురంలోని సొసైటీ కార్యాలయంలో ఉన్న ఎరువుల గొడౌన్‌లో ఎరువులను పరిశీలించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన పురుమందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. గడువు తీరిన మందులను విక్రయిస్తే ఆ షాపుల లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఏవో హైమావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని తోలిమిట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం టీవీఎస్ మోటారు సైకిల్ అనుబంధ శ్రీనివాసన్ సేవా సంస్థ సహకారంతో తిరుపతి అరవింద్ కంటి వైద్యశాల వైద్యులు కంటి వైద్య పరీక్షలు చేశారు. ప్రధానోపాధ్యాయులు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ 52 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి ఇద్దరికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల స్క్రీనింగ్ టెస్టర్ శంకర్, టీవీఎస్ ప్రతినిధి సురేష్ పాల్గొన్నారు.

భోజనం ప్లేట్లు వితరణ

తడ: మండలంలోని తడకండ్రిగ ప్రాథమిక పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు సోమవారం సూళ్లూరుపేటకు చెందిన జి.సురేంద్రబాబు భోజనం ప్లేట్లు అందజేశారు. తన తండ్రి నాగభూషణం జ్ఞాపకార్థం ప్లేట్లు ఇచ్చినట్టు తెలిపారు. ఎంఈవో మల్లికార్జునరావు, హెచ్ఎం సురేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ


ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యులు, జేవీవీ సభ్యులు

చిల్లకూరు : గూడూరు ఏరియా ఆస్పత్రికి పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ రక్త హీనత ఉన్న గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతా తెరవాలని, ఆస్పత్రిలో కాన్పు అయిన వెంటనే వారి ఖాతాలో రూ.5 వేలను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు జన విజ్ఞాన వేదిక సభ్యులు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, సభ్యులు నాగరాజు, చెంచునారాయణ, సుబ్బారావు, మస్తాన్, జగదీష్, పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవం సురక్షితం


గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ రాజకుమారి

రాపూరు: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకోవడం ఎంతో సురక్షితమని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజకుమారి తెలిపారు. ఆమె సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి నెలా పరీక్షలు చేసుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

12న మెగా జాబ్ మేళా

గూడూరు రూరల్ : గూడూరు రెండవ పట్టణంలోని ఐటీఐ కళాశాలలో ఈ నెల 12 మెగా జాబ్ మేళా ని ర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. ఆయన సోమవా రం మాట్లాడుతూ నాయుడుపేటలోని గ్రీన్‌టెక్, అమర్‌రాజా గ్రూప్, కోల్మాన్ సర్వీసెస్, భార్గవి ఆటో మొబైల్స్‌తో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారని పేర్కొన్నారు. ఐదో తరగతి, పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొ మా, ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత సాధించిన పాల్గొనవచ్చని సూచించారు. ఆధార్ కార్డుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 8639835953లో సంప్రదించాలని కోరారు.

గ్రామంలో ఉన్న మురుగు నీరు, పేడదిబ్బలు



కబళిస్తున్న ఫైలేరియా

వారు నిరుపేదలు.. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు.. వారికి ఫైలేరియా (బోదకాలు) వ్యాధి రావడంతో బతుకు దుర్భరమైంది. ఒకరు.. ఇద్దరు కాదు.. 14 మంది బోదకాలు బారిన పడ్డారు. పొట్టకూటి కోసం చెమటోడ్చి కష్టపడాలనే సంకల్పం ఉన్నా అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలిసినా వైద్యాధికారులు, పాలకులకు చీమకుట్టినట్టు కూడా లేదు. ఫలితంగా ఈ వ్యాధిబారిన పడేవారి సంఖ్య పెరుగుతోందని గ్రామస్తులు వాపోతున్నారు.

- ఒకే గ్రామంలో 12 మంది ఫైలేరియా బాధితులు
- పట్టించుకోని వైద్యాధికారులు

పెళ్లకూరు : మండల కేంద్రమైన పెళ్లకూరుకు 16 కిలోమీటర్ల దూరంలో అర్థమాల గ్రామం ఉంది. ఇక్కడ 170 కుటుంబాలు ఉన్నాయి. సుమారు 400 మందికి పైగా జీవనం సాగిస్తున్నారు. ఎక్కువ మంది గొర్రెలు, మేకలు, గేదెలు మేపుకుంటున్నారు. కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా పేడదిబ్బలు, మురికి కూపాలు దర్శనమిస్తున్నాయి. పగలే దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫలితంగా గ్రామంలో 14 మంది బోదకాలు(ఫైలేరియా వ్యాధి) బారిన పడ్డారు. స్పర్శ కోల్పోయిన కాళ్లతో అడుగు ముందుకు వేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి శరీరం సహకరించడం లేదు. గ్రామం నలువైపులా వ్యవసాయ పొలాలు ఉన్నాయి. వీరికి అవగాహన లేకపోవడంతో ఇళ్ల చుట్టూనే పశువుల పేడ దిబ్బలు వేసుకున్నారు. దీంతో గ్రామం మురికి కూపంలాగా తయారైంది. ఈ నేపథ్యంలో క్యూలెక్స్ దోమ కాటు వేయడంతో గ్రామానికి చెందిన రామాబత్తిన సుబ్బమ్మ, మద్దాలి చెంగయ్య, చెంబేటి సుబ్రమణ్యం, పల్లా బుజ్జమ్మ, మద్దాలి సుందరమ్మ ఇలా సుమారు 14 మంది బోదకాలు వ్యాధి బారిన పడ్డారు. నిత్యం గ్రామం ప్రధాన వీధుల్లో కూర్చొని సూటిపోటి మాటలు భరించలేక అవమానాలతో కృంగిపోతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులంతా కుటుంబాలకు భారమయ్యామని మనస్సు నిండా బాధను నింపుకొని తొందరగా పోతే బాగుంటుందని వాపోతున్నారు.


బోదకాలు (ఫైలేరియా) వ్యాధి బారిన పడిన గ్రామస్తులు

గ్రామం చుట్టూ మురుగు కూపాలే..

గ్రామంలో ఎక్కువ మంది పాడి రైతులు కావడం, మూగజీవాలను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. వారికి పరిసరాల శుభ్రతపై అవగాహన లేకపోవడంతో ఇళ్ల మధ్యే పేడదిబ్బలు వేసుకున్నారు. మురుగు నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో ఇళ్ల సమీపంలో నిలుస్తోంది. అంతేగాక తాగునీటి బోర్లు, కొళాయిల వద్ద పెద్ద పెద్ద గుంతల్లో నీరు ఉంటోంది. ఈగలు, దోమలు వృద్ధిచెంది పగలే స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు, పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీనికితోడు వైద్యం అందుబాటులో లేకపోవడం.. పట్టణాలకు వెళ్లే స్తోమత లేకపోవడం అర్థమాల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు ఏడాదికి ఒకసారి పారిశుధ్య వారోత్సవాల్లో తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



బోదకాలు వ్యాధితో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి నెలా మందులను ఉచితంగా పంపిణీ చేయాలి. అలాగే కుటుంబ పోషణ జరిగేలా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

\- కిష్టమ్మ, అర్థమాల గ్రామం

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



గ్రామంలో అధికంగా పేరుకుపోయిన పే డ దిబ్బలు తొలగించేలా పారిశుద్ధ్య పను లు చేపట్టాలి. మురుగు నిల్వలు ఎక్కువగా ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేపట్టి దోమలవ్యాప్తిని అరికట్టాలి.

\- చెంబేటి కృష్ణయ్య, అర్థమాల

పరిశీలించి చర్యలు చేపడతాం

అర్థమాల గ్రామంలో ఫైలేరియా కేసులు ఎక్కువగా ఉన్నట్టు మాకు సమాచారం లేదు. ఎవరూ ఫిర్యాదు చేయలేదు. అర్థమాల గ్రామాన్ని పరిశీలిస్తాం. పరిస్థితులపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తాం. త్వరలో మెడికల్ క్యాంపులు, పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాము.

\- డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, చెంబేడు పీహెచ్‌సీ వైద్యాధికారి

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు

కోట: మండల కేంద్రమైన కోటలో నిఘా మరింత పెంచేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వాకాడు సీఐ హుస్సేన్‌బాష తెలిపారు. ఆయన సోమవారం కోట గాంధీ బొమ్మ సెంటర్, ఆర్టీసీ సెంటర్, కోటక్రాస్ రోడ్డులోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నేరాల కట్టడకి పటిష్ట నిఘా అవసరమన్నారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎస్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

కండలేరులో 55.292 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 55.292 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 4,800 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పక్కా గృహాలకు నమోదు చేసుకోవాలి

వెంకటగిరి రూరల్ : ఇళ్లులేని పేదలు పక్కా గృహాల మంజూరుకు పేర్లు నమోదు చేసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య పేర్కొన్నారు. ఆయన సోమవారం వెంకటగిరి పట్టణంలోని సుదర్శనం నగర్‌లోని సచివాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తమ వార్డు పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని పడమటి వీధిలోని ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం బస్తాలను సోమవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. 40 ప్లాస్టిక్ సంచుల్లో బియ్యం ఉండడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రా క్రికెట్ అండర్-14 రాష్ట్ర జట్టుకు గూడూరు విద్యార్థి

గూడూరు రూరల్ : ఆంధ్రా క్రికెట్ అండర్-14 జట్టు ప్రాపబుల్‌గా ఎంపికైన గూడూరు విద్యార్థి లీలా వికాస్‌ను సోమవారం నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కొణిదల మునిగిరీష్, పలువురు సీనియర్ క్రీడాకారులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ గూడూరులోని ఏసీఏ సబ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న లీలా వికాస్ ఆంధ్రా రాష్ట్ర అండర్-14 విభాగంలో ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే ఏసీఏ సబ్ సెంటర్ నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. ప్రస్తుతం ప్రాపబుల్‌గా ఎంపికైన లీలా వికాస్ కడపలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో మంచి ప్రతిభ చూపినట్టు వివరించారు. ఈ నెల విజయనగరంలో జరిగే ప్రాపబుల్ మ్యాచ్‌లో ప్రతిభ చూపితే రాష్ట్ర జట్టులో సుస్థిర స్థానం పొందుతాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ సెక్రటరీ తూపిలి నాగేశ్వరరావు, సీనియర్ క్రీడాకారులు నూర్‌మహ్మద్, మధు, సుబ్రమణ్యం, రజని, విజయ, సంతానం, మహేష్, వెంకీ పాల్గొన్నారు.


ప్రాపబుల్ జట్టుకు ఎంపికైన అండర్-14 విభాగం క్రికెటర్‌తో క్లబ్ సభ్యులు

అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని అభినందిస్తున్న కమాండెంట్

వెంకటగిరి రూరల్ : మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో సోమవారం యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్- 2024 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బెటాలియన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో కమాండెంట్ అరుణ్‌బోస్ పావురాన్ని ఎగుర వేసి పోటీలను ప్రారంభించారు. మూడురోజులు పాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో తొలుత 800, 100 మీటర్ల పరుగు పందేలు, వాలీబాల్, లాంగ్‌జంప్, షటిల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు పంపిణీ చేయనున్నట్లు బెటాలియన్ అధికారులు తెలియజేశారు.

పరిశోధనలపై మక్కువ పెంచుకోవాలి

గూడూరు రూరల్ : విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకుని పరిశోధనలపై మక్కువ పెంచుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కిరణ్మయి తెలిపారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో సోమవారం జూనియర్ కళాశాల స్థాయి ఇంటర్ కాలేజీ గేట్ సైన్సు ఎగ్జిబిట్ కాంపిటీషన్ నిర్వహించారు. వివిధ కళాశాల విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. డాక్టర్ కిరణ్మయి వాటిని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇలాంటి వేదికలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. 5వ ఏపీ బాలికల బెటాలియన్ కల్నల్ అనుచ్‌వాద్వా మాట్లాడుతూ ఎన్‌సీసీ దేశంలో గర్వించదగిన విభాగంగా గుర్తింపు సాధించిందన్నారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిభ చపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్, కళాశాల కోశాధికారి విద్యాసాగర్‌రావు, ప్రిన్సిపాల్ హనుమంతరావు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న సింహపురి యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యులు కిరణ్మయి

ఉపకరణాల కోసం ప్రత్యేక శిబిరం




మాట్లాడుతున్న ఎంపీడీవో శివకుమార్, ఉపకరణాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న దివ్యాంగులు

సైదాపురం : దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల మంజూరు కోసం నెల్లూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు, వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ మాట్లాడుతూ శిబిరానికి మంచి స్పందన లభించిందని తెలిపారు. ఉప కరణాల కోసం 134 మంది పేర్లు నమోదు చేసుకున్నట్టు చెప్పారు. వారికి అవసరమైన ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, కళ్లద్దాలు త్వరలో అందజేస్తామన్నారు

12న ఉచిత వైద్య శిబిరం


మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షులు, సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని పీఆర్ క్లబ్‌లో ఈ నెల 12న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు కోడూరు మీరారెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరుకు చెందిన కిమ్స్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని వెల్లడించారు. గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల ప్రజలు శిబిరానికి రావాలని కోరారు. సమావేశంలో క్లబ్ సీనియర్ సభ్యులు శ్రీకంఠి రామ్మోహన్‌రావు, వేమూరు శ్రీధర్, జయకుమార్, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్ ఢీకొని వృద్ధుడి మృతి


మృతి చెందిన బాబయ్య

డక్కిలి: స్కూటర్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన డక్కిలిలోని రాపూరు-వెంకటగిరి జాతీయ రహదారి, దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటరు వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం.. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుకి చెందిన శ్రీరాంశెట్టి బాబయ్య (68) ఆటోలో కిరణా షాపులకు చిల్లర సామాను విక్రయించేందుకు డక్కిలిలో రోడ్డు దాటేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో మోపూరు రోడ్డుకు చెందిన చైతన్య అనే యువకుడు మోపూరు రోడ్డు నుంచి మోటారు బైక్‌పై అతి వేగంగా డక్కిలికి వస్తూ బాబయ్యను ఢీకొట్టాడు. దీంతో బాబయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వైద్య పరీక్షల నిమిత్తం డక్కిలి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. డక్కిలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్ : మండలంలోని మర్లపల్లి సమీపంలో జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం రాత్రి లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట మండలం వేముగుంటపాళెంకు చెందిన బల్లి మనోహర్(54) సొంత పనుల కోసం బైక్‌లో నాయుడుపేటకు వచ్చాడు. సోమవారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. మర్లపల్లి జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి వస్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడి మనోహర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని లారీని అదుపులోకి తీసుకున్నారు. మనోహర్ మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు ఆదర్శ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళం, పసుపు, కుంకుమ, విభూది తదితరాలతో అభిషేకాలు చేశారు. తదుపరి స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

భూ సమస్యలపై వినతుల వెల్లువ

దొరవారిసత్రం : మండలంలోని నెల్లూరుపల్లి, ముచ్చలగుంట గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూములకు పట్టాలు, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు, మ్యుటేషన్ తదితర సమస్యలపై అర్జీలు అందినట్టు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. వాటిని పరిశీలించి 30 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ గోపిరెడ్డి, సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.


దొరవారిసత్రం : నెల్లూరుపల్లిలో అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలకుమారి

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని మానమాల, బత్తలాపురం గ్రామాల్లో తహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలువురు భూసమస్యలపై వినతులు అందించారు. కార్యక్రమంలో వీఆర్వో మస్తానయ్య, సర్వేయర్ లక్ష్మినారాయణ, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు డీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు : మండలంలోని కలవకూరులో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో మూడు అర్జీలు మాత్రమే వచ్చాయి. గ్రామసభకు ఎవరూ రాకపోవడంతో అధికార పార్టీ నాయకులు అందుబాటులో ఉన్న మహిళలను తీసుకువచ్చి మమా అనిపించారు. గ్రామంలోని అసైన్డ్ భూములను పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు అక్కడి మట్టి, గ్రావెల్‌ను పరిశ్రమలు తరలిస్తున్నట్లు కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిణిబాయి, వీఆర్వో వంశీ తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం : ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం భూములు మంజూరు చేసిందని, వాటిలో సాగు చేసుకునేందుకు వెళితే అటవీశాఖ సిబ్బంది అడ్డుకుంటున్నారని తోత్సం గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేశారు. మండలంలోని గులించర్ల, తోత్సం, కృష్ణారెడ్డిపల్లి, మునగపాడు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ తోత్సం గ్రామం సమీపంలో సర్వే నంబర్‌లో 41పీలో 185 ఎకరాల భూమి ఉందన్నారు. 1995, 1996లో ప్రభుత్వం వాటికి పట్టాలు మంజూరు చేసిందన్నారు. వాటిలో సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆ భూములు అటవీ శాఖకు చెందినవని పేర్కొంటూ అడ్డుకుంటున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

డక్కిలిలో..

డక్కిలి : మండలంలోని పెదయాచసముద్రం, తిమ్మనగుంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 71 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. మ్యుటేషన్, భూముల సర్వే, పట్టాదారు పాసు పుస్తకాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, శ్మశానానికి దారి, సీసీ రోడ్డు తదితరాలపై అర్జీలు ఇచ్చినట్టు తెలిపారు. త్వరలో వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


ఓజిలి: మానమాలలో తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేస్తున్న ప్రజలు


పెళ్లకూరు : కలవకూరులో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు


సైదాపురం: తోత్సం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు